క్లుప్తంగా

నేడు ఎంపీపీ ఎన్నిక

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో అచ్చంపేట మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని, గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులంతా హాజరుకావలసినదిగా ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు బుధవార ఒక ప్రకటనలో కోరారు.

నేడు రంజాన్ తోఫా పంపిణీ

సత్తెనపల్లి: రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం పేదలకు గురువారం ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని 27వ వార్డు ముస్లింపేట పీర్లచావిడి వద్ద గల మదర్సాలో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ జరుగుతుందని ముస్లిం యూత్ నాయకులు బుధవారం తెలిపారు. రంజాన్ తోఫాకి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థినుల కృషి అనుభవ కార్యక్రమం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని డాట్ ట్రెనింగ్ సెంటర్ నరసరావుపేట ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినుల గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం చాగంటివారిపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు లింగాకర్షక బుట్టలు, వరిలో కాండం తొలుచు పురుగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలపై వచ్చే వివిధ రకాల చీడపీడల యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి: చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అచ్చంపేట మండలం కొండూరుకి చెందిన ఆల స్వామి(44) భార్య వెంకాయమ్మతో మనస్పర్థల కారణంగా మూడు రోజుల క్రితం పొట్ట, తదితర ప్రాంతాల్లో కత్తితో కోసుకొని గాయాలపాలై చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేరాడు. ఈ క్రమంలో పురుషుల వార్డులో చికిత్స పొందుతున్న స్వామి వార్డులోని బాత్రూమ్ కిటికీకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య వెంకాయమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు యలమంద రాజు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు స్వామి మృతదేహానికి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఫిజికల్ సైన్సు పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

రాజుపాలెం: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో 448 మంది విద్యార్థులు బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష రాయాల్సి ఉండగా 441 మంది హాజరయ్యారు. 7 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలోని పరీక్ష కేంద్రంను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎంఈవో-2 నరసింహారావు తెలిపారు.

ట్రక్ ఆటో ఢీకొని మహిళకు గాయాలు

నాదెండ్ల: చిలకలూరిపేట-నరసరావుపేట రహదారిపై ఫార్‌కార్నర్స్ వద్ద టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనాన్ని ట్రక్ ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ గాయాలపాలైంది. పోలీసుల కథనం ప్రకారం.. కావూరు-లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ సైదాబీ మంగళవారం మధ్యాహ్నం సరుకుల కొనుగోలుకు మోపెడ్‌పై చిలకలూరిపేటకు బయలు దేరింది. ఫార్‌కార్నర్స్ వద్ద వెనుక నుంచి మహీంద్రా ట్రక్ ఆటో ఢీకొంది. గాయపడిన క్షతగాత్రురాలు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

భవనంపై నుంచి పడి తాపి మేస్త్రీ మృతి

నరసరావుపేట టౌన్: భవనంపై నుంచి పడి తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం... ఇక్కుర్తి గ్రామానికి చెందిన భవనగిరి శ్రీనివాసరావు(48) ఎన్‌జీవో కాలనీలో నూతన ప్రైవేటు వైద్యశాల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రెండవ అంతస్తులో ఉన్న ఇనుము తొలగిస్తూ ప్రమాదవశాత్తు జారి మొదటి అంతస్తులోకి పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని సమీపంలోని వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసరావు మృతిచెందినట్టు ధృవీకరించారు. సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతునికి భార్య వెంకటరమణతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

టీకా వేయించు..
వ్యాధులు నివారించు..!

- సీజనల్ వ్యాధుల నివారణకు పశువులకు టీకాలు తప్పనిసరి
- మూగజీవాలకు రక్షించుకోవాల్సిన బాధ్యత పశు పోషకులదే



గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశు వైద్యాధికారి

అమరావతి: రైతన్నల జీవన పోరాటంలో వారికి చేదోడు వాదోడుగా ఉండేది ఎక్కువగా మూగజీవాలే. అవి శారీరక శ్రమతో పాటు ఆర్థికంగా కూడా అండగా నిలుస్తున్నాయి. అలాంటి పశువుల ప్రాణాలను కాపాడుకోవడం రైతన్నల బాధ్యత. ఒంట్లో బాగోకపోయినా, ఏ జబ్బు వచ్చినా మూగజీవాలు చెప్పలేక మృత్యువాత పడుతుంటాయి. అందుకే వ్యాధులు రాకుండా ముందస్తు టీకాలు వేయించి రక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంది.

+ పెదకూరపాడు నియోజకవర్గంలో 24,476 ఆవులు, 79,345 గేదెలు, 53,781 గొర్రెలు, 32,029 మేకలు ఉన్నాయి. తెల్లజాతికి చెందిన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు ఎక్కువగా గాలికుంటు, జబ్బవాపు వ్యాధి, నల్లజాతికి చెందిన బర్రెలు, పడ్డలు, దున్నల్లో గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లలో చిటుక వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయి. వీటి నివారణకు పశు సంవర్ధక శాఖ అధికారులు ఇప్పటికే నివారణ టీకాలు వేస్తున్నారు. రైతన్నలు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలి. గాలికుంటు వ్యాధి వ్యాపిస్తే పాల ఉత్పత్తి, ఎద్దుల్లో బరువులెత్తే సామర్థ్యం, దూడల్లో వ్యాధినిరోధక శక్తి తగ్గి మృత్యువాత పడతాయి. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల్లో నోటి నుంచి సొంగ రావటం, పశువులు అధిక జ్వరంతో ఊగిపోతాయి. పశు వైద్యులను సంప్రదించి ముందస్తు టీకాలు వేయించుకోవటం వల్ల అనేక ఉపయోగాలున్నాయి.

గొంతువాపు వ్యాధి

నల్లజాతి పశువులు బర్రెలు, పడ్డలు, దున్నల్లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంది. గొంతు కింద భాగంలో నొప్పితో కూడిన వాపులుంటాయి.. ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుతుంది. ఆయాసం, గురక, తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మత్యువాతపడే అవకాశాలున్నాయి. ఈ వ్యాధి రాకుండా ఏటా మే, జూన్ మాసాల్లో హెమరేజిక్ సెప్టిసేమియా టీకా వేయించాలి.

చిటుక వ్యాధి

బ్యాక్టీరియా వల్ల జీవాల్లో చిటుక వ్యాధి వ్యాపిస్తుంది. తొలకరి వర్షాలు కురిసాక మొలిచిన లేత గడ్డిని మేసినప్పుడు బ్యాక్టీరియా జీవాల శరీరంలోకి వెళ్లటం ద్వారా చిటుక వ్యాధి వ్యాపిస్తుంది. నీరసంగా ఉండటం, జ్వరం, గడ్డి తినకపోవటం ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి తీవ్రమై గాల్లోకి ఎగిరి గిలగిలా కొట్టుకుంటూ మత్యువాత పడతాయి. ముందుజా జాగ్రత్తగా ఎంటరోటాక్సిమియా టీకాను వేయించాలి.

జబ్బ వాపు వ్యాధి

తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బ వాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల జబ్బ, వెన్ను, తొడ తదితర కండ ఉన్న శరీరభాగాల్లో నల్లటి వాపు కనిపిస్తుంది. ఈ వాపును చేతితో నొక్కినప్పుడు బుడగ మాదిరి శబ్దం వస్తుంది. జ్వరం రావటం, మేత మేయకపోవటం, కదలలేకపోవటం, కడుపునొప్పి వంటి లక్షణాలుంటాయి. సకాలంలో చికిత్స చేయించకపోతే మృత్యువాత పడే అవకాశాలున్నాయి. జబ్బవాపు రాకుండా బ్లాకా క్వార్టర్ టీకా వేయించాలి. వ్యాధిబారిన పడి పశువులకు పెన్సిలిన్ ఇంజెక్షన్లతో పాటు సెలిన్ బాటిళ్లు పెట్టించాల్సి ఉంటుంది.

1902కు ఫోన్ చేయవచ్చు

పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడితే అత్యవసర చికిత్స కోసం 1902కు ఫోన్ చేయవచ్చు. పశు వైద్యశాల సిబ్బంది వచ్చి వెంటనే వైద్యం అందిస్తారు. అవసరమైతే వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తారు.

టీకాలు వేయించాలి

పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తు టీకాలు వేస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టీకా వేయించడం వల్ల జీవాలకు గాలికుంటు, జబ్బ వాపు, గొంతు వాపు, చిటుక వ్యాధులు దరిచేరవు. టీకాలను పశుపోషకులు తప్పనిసరిగా వేయించాలి.

– వెంకట్రామయ్య, పశు సంవర్ధక శాఖ ఏడీ, అమరావతి

ఏఎంసీ మాజీ చైర్మన్ సాంబయ్య మృతి పార్టీకి తీరని లోటు

మాజీ మంత్రి అంబటి రాంబాబు



కట్టా సాంబయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, నాయకులు

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటును మిగిల్చిందని ఆ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ, గుడిపూడి గ్రామాల్లో కట్టా సాంబయ్య దశదిన కర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించగా నందిగామలో అంబటి రాంబాబు, గుడిపూడిలో సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి పాల్గొని సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు, డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలోనే కాక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతంలో కట్టా సాంబయ్య క్రియాశీలకంగా పని చేశారని కొనియాడారు. ముఖ్యంగా గుడిపూడి గ్రామంలో సాంబయ్య లేని లోటు పూడ్చేది కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కట్టా సాంబయ్య పార్టీకి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, నాయకులు పెండెం బాబురావు, షేక్ నాగూర్ మీరాన్, రాయపాటి పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, భవనం రాఘవరెడ్డి, అచ్యుత శివప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వీఆర్ఏల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

వీఆర్ఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షేక్ బందగీ సాహెబ్, వీఆర్ఏలు

సత్తెనపల్లి: గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్ఏల) రాష్ట్ర సదస్సు ఏప్రిల్ 5న విజయవాడలో జరగనుందని, ఈ సదస్సును జయప్రదం చేయాలని వీఆర్ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్ పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలో వీఆర్ఏల సంఘం సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రవి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని, వీఆర్ఏలకు గత 8 సంవత్సరాలుగా జీతాలు పెంచలేదని, ప్రమోషన్లు ఇవ్వలేదని, రాష్ట్రంలో మంత్రులు, ముఖ్యమంత్రులు మారుతున్నారు కానీ వీఆర్ఏల కష్టాలు, సమస్యలు తీర్చేవారు కనిపించడం లేదన్నారు. పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పే స్కేలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. మన రాష్ట్రంలో కూడా వీఆర్ఏలకు పే స్కేలు జీతాలు ఇవ్వాలని మంత్రులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనికరించడం లేదన్నారు. అటెండర్, నైట్ వాచ్‌మెన్, వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. కానీ దొడ్డిదారిన నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు మాత్రం బలవంతంగా చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో వీఆర్ఏల ఊసే లేదన్నారు. ఏప్రిల్ 5న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో ప్రతి వీఆర్ఏ పాల్గొని జయప్రదం చేయాలని, వీఆర్ఏలు అందరూ ఐకమత్యంగా పోరాడదామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో సత్తెనపల్లి మండల, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ముప్పాళ్ళ: మండల పరిషత్ కో ఆప్షన్ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ కాశయ్య బుధవారం తెలిపారు. మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన ఎస్‌కే అజ్గర్‌వలి అనారోగ్యంతో జనవరి నెలలో మృతి చెందారు. దీంతో కో ఆప్షన్ పదవి ఖాళీ అయింది. ఖాళీగా ఉన్న కో ఆప్షన్ సభ్యుని పదవికి గురువారం ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గాను దమ్మాలపాడు-1 మినహా అన్ని స్థానాల్లోను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే ఎంపీటీసీలుగా వ్యవహరిస్తున్నారు. వీరిలో ఐదుగురు ఎంపీటీసీలు ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో కో ఆప్షన్ ఎన్నికపై టీడీపీ కన్నేసింది. కాగా కో ఆప్షన్ పదవిపై ముప్పాళ్ళ గ్రామ టీడీపీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. ముప్పాళ్ళలోని ముస్లిం సామాజిక వర్గంలో రెండు గ్రూపులు వారు ఎవరికి వారే కో ఆప్షన్ పదవి కోసం నియోజకవర్గ నేత వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి కో ఆప్షన్ పదవి వరిస్తుందో తెలియాల్సి ఉంది.

రెండు ఉపసర్పంచ్ పదవులకు

మండలంలోని రెండు గ్రామాల్లో ఉప సర్పంచ్ పదవులకు ఉప ఎన్నిక జరగనుంది. ఆ మేర ఎన్నికల అధికారులను నియమించారు. మాదల ఉప సర్పంచ్ ఎన్నికకు ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, రుద్రవరం ఉపసర్పంచ్ ఎన్నికకు పంచాయతీరాజ్ ఏఈ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఆయా గ్రామాల్లో ఉపసర్పంచ్ పదవి కోసం టీడీపీ శ్రేణులు పోటీ పడుతున్నారు. జనసేన నాయకులు కూడా ఉపసర్పంచ్ కోసం పట్టుబడుతుండటంతో పోటీ నెలకొంది.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



పెదకూరపాడు: సత్తెనపల్లి రూరల్ మండలం గుడిపూడి గ్రామానికి కర్నూలు నుంచి నిండు గర్భిణి సముద్రాలు వలస కూలీగా రావటం జరిగింది. ఈ క్రమంలో గర్భిణి సముద్రాలు బుధవారం సాయంత్రం ప్రసవ వేదనతో బాధపడుతుంటే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సత్తెనపల్లి అంబులెన్స్ ఖాళీ లేకపోవటంతో పెదకూరపాడు అంబులెన్స్‌లో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు అధికమయ్యాయి. రోడ్డు పక్కన అంబులెన్స్ నిలిపి వేసి 108 ఈఎంటీ వెంకట్రావు, పైలట్ వెంకటేశ్వర్లు సాయంతో కాన్పు నిర్వహించగా సముద్రాలుకు ఆడబిడ్డ జన్మించింది. తల్లి బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అనంతరం తల్లి బిడ్డ ఇద్దరిని సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా ఏడుకొండలు



పెదకూరపాడు: ఇటీవల బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ బీఎస్పీ రాష్ట్ర నూతన కార్యవర్గంలో పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన వరగాని ఏడుకొండలును రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా బుధవారం వరగాని ఏడుకొండలు మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ కుమార్‌కు తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర కో ఆర్డినేటర్ బక్కా పరంజ్యోతి, రాష్ట్ర కో ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాష్ట్రంలో బీఎస్పీని శక్తివంతంగా చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపోలో బుధవారం హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ 19వ బ్యాచ్ శిక్షణతరగతులను డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ తీసుకొని హెవీ లైసెన్స్ పొందిన వారికి భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు

నకరికల్లు: ప్రతి రైతు 11 అంకెల విశిష్ట సంఖ్యకు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఆశించిన చీడపీడలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. 11 అంకెల విశిష్ట సంఖ్యతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ సంక్షేమ పథకాలకు అర్హత పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్వో జి.కృష్ణకుమారి, ఉద్యానవన సహాయకులు పి.సాయి వెంకట్, రైతులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి



బండి మహంకాళి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): గేదెల కొనుగోలుకు ద్విచక్ర వాహనంపై సంతకు వెళుతూ మరో ద్విచక్ర వాహనం ఎదురుగా ఢీకొన్న ప్రమాదంలో మృత్యువాత పడ్డ ఘటన మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాదల గ్రామానికి చెందిన బండి మహంకాళి (40) క్రోసూరు సంతలో గేదెలు కొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఇరుకుపాలెం సమీపంలోని మదర్సా వద్ద సత్తెనపల్లి వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మహంకాళి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ద్విచక్ర వాహనదారుడైన ఇరుకుపాలెం గ్రామానికి చెందిన మాచర్ల మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సత్తెనపల్లి పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయపడిన మణికంఠను బంధువులు చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై ఎస్సై వి.సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



నార్నెపాడులో రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న ఏఓ అరుణ

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడు, దమ్మాలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబర్, సర్వే నెంబర్‌తో గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. మార్చి 31 వరకు మాత్రమే సాగునీరు విడుదలవుతుందని, రైతులందరూ ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకొని పంటలను కాపాడుకోవాలన్నారు. పంట ఉత్పత్తులను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం క్వింటా మినుములకు రూ.7,400, మొక్కజొన్న రూ.2,225, కంది రూ.7,550 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అమ్ముకోవాలంటే రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఏఈఓ ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి గ్రామాలలో పంచప్రాధాన్యాలు

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా పంచ ప్రాధాన్యాల పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- పశువులకు నీటి వసతి ఉన్న ప్రదేశం, పశువుల రాకపోకలకు, పశువులు మందగా చేరుటకు అనువైన ప్రదేశంలో నీటి తొట్టెలను నిర్మించవలసి ఉందన్నారు.
- లక్ష్యం మేరకు సేద్యపు నీటి కుంటలు, ఇన్‌లెట్, అవుట్‌లెట్, సీల్ట్ ట్రాప్ పనులు పూర్తి చేయవలసి ఉందన్నారు.
- పంట కాలువ, ఫీడర్, సప్లై చానల్ పనులకు సంబంధించి అవసరాన్ని బట్టి పంట కాలువలు పునరుద్ధరించవలసి ఉందన్నారు.
- విస్తృత స్థాయిలో కూలీలకు పని కల్పించడం కొరకు చెరువు కుంటలను వాటి అసలు సామర్థ్యం మేరకు పునరుద్ధరించడం, మట్టి గుంతలను చెరువు కట్ట అడుగు నుంచి కట్ట ఎత్తు కంటే పదిరెట్లు దూరం తరువాత తవ్వవలసి ఉందని ఎంపీడీవో చెప్పారు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన సగటు దినసరి వేతనం రూ.300 పొందడానికి ఆయా పనులకు సంబంధించిన కచ్చితమైన మార్కవుట్ ఇచ్చి పని చేయునట్టు మేట్లు శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి శుక్రవారం రోజుగార్ దివస్ సందర్భంగా కూలీలకు ఆయా పనులకు సంబంధించిన మార్కెట్, దినసరి వేతనంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలి

- వారికి కనీస వేతనం వెంటనే చెల్లించాలి
- కరపత్రం ఆవిష్కరించిన నాయకులు, కార్మికులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ కార్మికులపై శానిటరీ ఇనస్పెక్టర్లు చేస్తున్న మానసిక, ఆర్థిక వేధింపులను అరికట్టాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబల ఏడుకొండలు అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల సమాన పనికి సమానం ఇవ్వకుండా వారిని వేధింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కరపత్రాన్ని మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాట దీక్షా శిబిరంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఈ మధ్యకాలంలో మంత్రి లోకేష్ కార్మికుల అందరితో సంభాషించడం జరిగిందన్నారు. కానీ అప్పటినుండే కార్మికులపై మానసిక, ఆర్థిక వేధింపులు పెరిగాయన్నారు. కార్మికుల సమస్యను సకాలంలో పరిష్కరించాల్సినటువంటి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్ కమిషనర్ ఇద్దరు మొండిగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, మాల మహానాడు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు బోరుగడ్డ అంబేద్కర్ పాల్గొన్నారు.

లౌకికతత్వానికి భిన్నమైన ఆలోచనలు సరైనవి కావు

చిలకలూరిపేట: ప్రజాస్వామ్యం, లౌకిక తత్వానికి భిన్నమైన ఆలోచనలు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తాయని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామంలో సమితి సభ్యుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక వర్గాల జనాభా నిష్పత్తి ప్రకారం గుర్తింపు ఇవ్వాలని కోరారు. న్యాయ వ్యవస్థలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. విద్యా, ఉద్యోగాలకు దూరంగా ఉన్న కుటుంబాల్లోని వారు చదువు విలువ గుర్తించి తమ పిల్లలను పాఠశాలలకు పంపి విద్యనభ్యసించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు పి.అబ్రహం, కె.అంజలి, బి.సోమయ్య, ఎస్.మస్తాన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అంకితభావమే విద్యార్థుల అభ్యున్నతి

యడ్లపాడు: ఉపాధ్యాయులు అంకిత భావంతో తమ వృత్తిని కొనసాగిస్తే విద్యార్థులు అన్ని పోటీల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకుంటారని ఎంఈవో-1 ఎంవీ నాగరత్నం చెప్పారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మైదవోలు గ్రామంలోని మండల పరిషత్ బీసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థి దావల ప్రదీప్‌ను అభినందించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్షా పోటీల్లో మంచి మెరిట్‌తో పాటు మద్దిరాల జేఎన్‌వీలో సీటు సాధించినందుకు ఎంఈవో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు క్యాలిగ్రఫీ, హిందీ అక్షరమాల, గుణింతాలు, యోగా, ధ్యానం, సంస్కృత శ్లోకాల పరిచయం, పెయింటింగ్ వంటి విభాగాల్లో ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇవ్వడంపై ఉపాధ్యాయులను ప్రశంసించారు. రానున్న ఏడాది జేఎన్‌వీ ప్రవేశాలకు ఎక్కువ మంది విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్ ఉమామహేశ్వరీ, టీచర్లు జీవీ హేమలత, షేక్ షహనాజ్, జి సతీష్‌కుమార్ ఉన్నారు.

ములకలూరి వాసికి నేషనల్ పీస్ అవార్డు



నూజెండ్ల: నూజెండ్ల మండలం ములకలూరు గ్రామానికి చెందిన కవి రచయిత గాయకుడు జీవజ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మందా వెంకట్రావుకు నేషనల్ పీస్ కౌన్సిల్ అవార్డు దక్కింది. ఈనెల 23న పుణెలో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తమ్ముడు దుర్గా స్టాలిన్, తదితర ప్రముఖులు చేతుల మీదగా ఈఅవార్డు అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 30 మంది ఎంపిక కాగా ఆంధ్రప్రదేశ్ తరుపున అరుదైన అవార్డు దక్కిందని అవార్డు గ్రహీత మందా వెంకట్రావు బుధవారం తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వెంకటరావు దళిత ఉద్యమాలో పాల్గొంటు గుర్తింపు తెచ్చుకున్నారు. రాజకీయాల్లో చురుకగా పాల్గొంటూ వినుకొండ శాసనసభ ఎన్నికల్లో రెండు సార్లు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. తన గళం ద్వారా బలహీన వర్గాలలో చైతన్యం నింపే వెంకటరావుకు ఈఅవార్డు దక్కటం అభినందనీయమని గ్రామస్తులు కొనియాడారు.